

మెగా భేటీతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలా?

❖ *జనసేన ప్రవేశంపై చర్చ.. 2028 ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ వ్యూహమా?*

కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్ హైదరాబాద్‌లో సమావేశం కావడం తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. ఈ భేటీ మర్యాదపూర్వకమైనదా? లేక తెలంగాణలో బీజేపీ-జనసేన మధ్య కొత్త రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ సమావేశం ఆధారంగా రాజకీయ పొత్తులు లేదా కొత్త నిర్ణయాలు ఖరారయ్యాయని చెప్పడానికి ప్రస్తుతానికి ఎలాంటి ఆధారాలు లేవు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 39.4 శాతం ఓట్లతో 64 స్థానాలు, బీఆర్ఎస్ 37.35 శాతం ఓట్లతో 39 స్థానాలు, బీజేపీ 13.9 శాతం ఓట్లతో 8 స్థానాలు సాధించాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ చెరో 8 స్థానాలు గెలుచుకున్నాయి. బీఆర్ఎస్ ఒక్క స్థానాన్ని కూడా సాధించలేకపోయింది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో మారుతున్న ఓటరు అభిరుచులను సూచిస్తున్నప్పటికీ, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా గణనీయమైన పునాది ఉందనే విషయాన్ని విస్మరించలేం.

ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల్లో పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం సాధించిన జనసేన తెలంగాణలోనూ రాజకీయంగా విస్తరించేందుకు ప్రయత్నిస్తే ఎలాంటి ఫలితాలు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో పోటీ చేసినా ఆ పార్టీ ఒక్కచోటా గెలవలేదు. పవన్ కల్యాణ్‌కు యువతలో ఉన్న ఆదరణ, చిరంజీవి కుటుంబానికి ఉన్న సినీ అభిమానుల బలం ప్రచారపరంగా ఉపయోగపడవచ్చు. అయితే సినీ ప్రజాదరణను ఓట్లుగా మార్చడం అంత సులభం కాదు. 2009లో ప్రజారాజ్యం పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 18 స్థానాలు గెలుచుకున్న అనుభవం దీనికి ఒక ఉదాహరణ.

తెలంగాణలో జనసేన రాజకీయ విస్తరణకు ప్రధాన సవాలు ప్రాంతీయ ఆత్మగౌరవం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం, యువత త్యాగాలు, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలు ప్రజల మనసుల్లో బలంగా ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన రాజకీయ వైఖరులపై ఇప్పటికీ ఒక వర్గంలో అసంతృప్తి ఉంది. ఆంధ్ర ప్రాంత ప్రజలపై వ్యతిరేకతకు, తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను వ్యతిరేకించిన రాజకీయ వైఖరిపై ఉన్న అసంతృప్తికి మధ్య తేడాను గుర్తించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని గౌరవించే విధంగా రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాల్సి ఉంటుంది.

తెలంగాణలో బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చినప్పటికీ, అసెంబ్లీ స్థాయిలో విస్తృతమైన నాయకత్వం, సామాజిక సమీకరణాలను మరింత బలోపేతం చేసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జనసేనతో అవగాహన లేదా మెగా కుటుంబం నుంచి ప్రచార మద్దతు లభిస్తే బీజేపీకి అదనపు బలం చేకూరే అవకాశం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే చిరంజీవి, రామ్‌చరణ్ రాజకీయాల్లోకి వస్తున్నారని లేదా జనసేనతో బీజేపీ పొత్తు ఖరారైందని భావించడం తొందరపాటే.

2028 అసెంబ్లీ ఎన్నికల దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, బీఆర్ఎస్ పునరుద్ధరణ ప్రయత్నాలు, బీజేపీ విస్తరణ వ్యూహాలు కీలకం కానున్నాయి. జనసేన కూడా తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలమైతే పోటీ మరింత బహుముఖంగా మారే అవకాశం ఉంది. కానీ స్థానిక నాయకత్వం, క్షేత్రస్థాయి కేడర్, తెలంగాణ ఉద్యమ వారసత్వంపై స్పష్టమైన వైఖరి లేకుండా కేవలం సినీ గ్లామర్‌తో రాజకీయ స్థిరత్వం సాధించడం కష్టమే.

తెలంగాణకు కొత్త రాజకీయ పార్టీ కంటే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే కొత్త రాజకీయ సంస్కృతి అవసరం. నిరుద్యోగం, రైతుల సమస్యలు, నీటి వనరులు, విద్య, వైద్యం, పట్టణాభివృద్ధిపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వచ్చే పార్టీలకే ప్రజల ఆదరణ లభిస్తుంది. ప్రముఖుల భేటీలు రాజకీయ చర్చలకు దారితీయవచ్చు కానీ ఎన్నికల ఫలితాలను నిర్ణయించేది ప్రజల అనుభవాలు, ప్రభుత్వ పనితీరు, నాయకత్వ విశ్వసనీయతే.



— కొలను వెంకటేశ్వర రెడ్డి
SP Jails (Retd.)

రంగారెడ్డి జిల్లాలో నవంబర్ 12న జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

❖ *యువతలోని కళా ప్రతిభకు వేదిక.. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికలు*



దశ, రంగారెడ్డి: యువతలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్. స్వర్ణలత తెలిపారు. 30వ జాతీయ యువజన ఉత్సవాలు-2027 సందర్భంగా నవంబర్ 12న ఉదయం 9 గంటల నుంచి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి.

15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. జానపద నృత్యం, జానపద గీతాలు, పోస్టర్ తయారీ, చిత్రలేఖనం, వీధి నాటకం, కవితా రచన విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జానపద నృత్యం, జానపద గీతాల బృందాల్లో గరిష్ఠంగా 10 మంది పాల్గొనవచ్చు. వీధి నాటక బృందంలోనూ గరిష్ఠంగా 10 మందికి అవకాశం ఉంటుంది. కవితా రచన తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో చేయవచ్చు. గరిష్ఠంగా 500 పదాల్లో కవిత రాయాలి. పోస్టర్ తయారీకి ఏ3 పరిమాణం కాగితంపై 90 నిమిషాల సమయం కేటాయిస్తారు.

ఒక్కో కళాకారుడు ఒక విభాగంలో మాత్రమే పాల్గొనాలి. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాలకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు 2027 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం పొందుతారు.

ఆసక్తి గల అభ్యర్థులు తమ పేరు, వయస్సు, పుట్టిన తేదీ, ఆధార్ వివరాలు, ఫోన్ నంబర్, పోటీ విభాగం వివరాలతో నవంబర్ 11లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారి సూచించారు. దరఖాస్తులను ksteprr\@gmail.comకు పంపవచ్చు. ఇతర వివరాలకు 9849909077 నంబర్‌లో లేదా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు.

మాల్ గ్రామానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి



❖ *నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వెంటనే పునరుద్ధరించాలి*

❖ *ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన సర్పంచ్ బెల్లి అశోక్, MRPS నాయకులు*

దశ, యాచారం: రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మాల్ గ్రామానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు, ఎన్నో సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న మాల్ బస్టాండ్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు గ్రామ సర్పంచ్ బెల్లి అశోక్, MRPS యాచారం మండల అధికార ప్రతినిధి కంబాలపల్లి మహేష్ వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బెల్లి అశోక్ మాట్లాడుతూ గ్రామంలో బస్సుల కొరత కారణంగా ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను పునరుద్ధరించి ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

MRPS యాచారం మండల అధికార ప్రతినిధి కంబాలపల్లి మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగులు, నిత్యం ప్రయాణించే ప్రజల రవాణా సమస్యలపై ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

మాల్ గ్రామానికి సరిపడా బస్సు సర్వీసులు నడపడంతో పాటు, బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వెంకటేష్, BRS నాయకులు గెనమోని రమేశ్ యాదవ్, మందడి ప్రశాంత్ రెడ్డి, గెనమోని అంజయ్య యాదవ్, గొల్లపల్లి వెంకటయ్య, దొంతగొని నవీన్ గౌడ్, మావిళ్ల మల్లేష్ యాదవ్, పాల శ్రీకాంత్ యాదవ్, మించ రమేశ్ గౌడ్, గిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



టపాసులతో జాగ్రత్త: ఎస్ఎఫ్ఓ జి. శ్రీనివాస్

దశ, భద్రాచలం: దీపావళి పండుగ వేళ బాణాసంచా కాల్చేసమయంలో ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు, తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక శాఖ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జి. శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలం పట్టణ పరిధిలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదుల్లో విద్యార్థులతో నేరుగా ముచ్చటిస్తూ ప్రమాద రహితంగా పండుగ జరుపుకోవడానికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. చిన్నారులు, విద్యార్థులు బాణాసంచా కాల్చేటప్పుడు తప్పనిసరిగా తల్లిదండ్రులు లేదా పెద్దల సమక్షంలోనే బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కాల్చాలని ఎస్ఎఫ్ఓ సూచించారు. టపాసులు కాల్చే సమయంలో సింథటిక్ వస్త్రాలకు దూరంగా ఉంటూ కేవలం కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలన్నారు. టపాసులను చేతుల్లో పట్టుకుని వెలిగించడం, జేబుల్లో నింపుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. అలాగే ముందస్తు జాగ్రత్తగా టపాసులు కాల్చే ప్రదేశంలో బకెట్లతో నీరు, ఇసుకను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు.

వ్యసన విముక్తికి భరోసాగా హోప్ డి-అడిక్షన్ సెంటర్

❖ *ఘనంగా హోప్ ఆల్కహాల్ డి-అడిక్షన్ సెంటర్ మూడో వార్షికోత్సవ వేడుకలు*

దశ, హనుమకొండ: మద్యపాన వ్యసనానికి బానిసలై జీవితాలను కోల్పోతున్న వారికి పునర్జన్మ ప్రసాదించాలనే లక్ష్యంతో హోప్ ఆల్కహాల్ డిఅడిక్షన్ సెంటర్ విశేష సేవలందిస్తోంది. ఈ కేంద్రం మూడో వార్షికోత్సవ వేడుకలను మంగళవారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. సెంటర్ నిర్వాహకులు ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యసన విముక్తి ఆవశ్యకత, బాధితులకు అందిస్తున్న సేవలను వివరించారు.

మద్యపాన వ్యసనం వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులు, సామాజిక గౌరవంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. సరైన వైద్యం, మానసిక కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం అందిస్తే వ్యసన బాధితులు తిరిగి సాధారణ జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. వ్యసన విముక్తి ఒక్కరోజులో సాధ్యమయ్యేది కాదని, నిరంతర పర్యవేక్షణ, ఆత్మవిశ్వాసం, తగిన మార్గదర్శకత్వం అవసరమని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా ఎన్నో జీవితాల్లో మార్పునకు కృషి చేస్తున్న హోప్ డిఅడిక్షన్ సెంటర్ భవిష్యత్తులో మరింత మందికి సేవలందించాలని ఆకాంక్షించారు. వ్యసనానికి దూరంగా.. ఆరోగ్యకరమైన జీవితానికి చేరువగా.. అనే సందేశంతో వేడుకలు ముగిశాయి.



చిట్టీల పేరుతో రూ.1.50 కోట్ల మోసం

దశ, చేర్యాల: నమ్మకమే పెట్టుబడిగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ సుమారు రూ.1.50 కోట్ల మేర మోసానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ శివారులో వెలుగుచూసింది. చిట్టీలు కట్టి డబ్బులు కోల్పోయిన బాధితులకు నగదు తిరిగి చెల్లించాల్సింది పోయి, నిర్వాహకుడు కోర్టు ద్వారా ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ నోటీసులు పంపించడంతో వివాదం ముదిరింది.

బీడీ కాలనీకి చెందిన మహ్మద్ అజీజ్ అహ్మద్ కొంతకాలంగా అనధికారికంగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ప్రారంభంలో లావాదేవీలు సజావుగా సాగడంతో కాలనీవాసులు అతడిని నమ్మి పెద్ద సంఖ్యలో చిట్టీలు వేశారు. ఆడపిల్లల పెళ్లిళ్లు, ఇళ్ల నిర్మాణాలు, కుటుంబ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును చిట్టీల్లో పెట్టుబడిగా పెట్టారు. అయితే కొంతకాలంగా చిట్టీలు ఎత్తుకున్న వారికి డబ్బులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు ఒత్తిడి చేయడంతో నిర్వాహకుడు తాను ఆర్థికంగా నష్టపోయానని, అప్పులు తీర్చే స్థోమత లేదని పేర్కొంటూ కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. దీంతో బాధితులకు ఐపీ నోటీసులు అందాయి. తమ కష్టార్జితాన్ని తిరిగి చెల్లించాలని, చిట్టీల మోసంపై సమగ్ర విచారణ జరపాలని బాధితులు డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు బాధితులు తరలివెళ్లారు.

కుంట్లూరులో పార్కు స్థలానికి విముక్తి.. 577 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా!

❖ *మంజీరా కాలనీలో ఆక్రమణల తొలగింపు.. ప్రహరీల కూల్చివేత, పార్కు స్థలంగా హైడ్రా బోర్డుల ఏర్పాటు*

దశ, పెద్ద అంబర్‌పేట్ : ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాల పరిరక్షణలో హైడ్రా మరో కీలక చర్యచేపట్టింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు గ్రామంలోని మంజీరా కాలనీలో ఆక్రమణకు గురైన 577 గజాల పార్కు స్థలాన్ని మంగళవారం హైడ్రా అధికారులు కాపాడారు.

గ్రామపంచాయతీ లేఅవుట్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు తిరిగి ప్లాట్లుగా విక్రయించినట్లు సమాచారం. ఈ క్రమంలో అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ప్రహరీ నిర్మించి, భవన నిర్మాణాలకు సిద్ధమయ్యారు. దీంతో పార్కు స్థలం అన్యాక్రాంతం అవుతోందని ఆందోళన వ్యక్తం చేసిన మంజీరా కాలనీ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్థానిక మున్సిపల్ అధికారులకు సైతం గతంలో ఫిర్యాదు చేసినట్లు హైడ్రా దృష్టికి తీసుకెళ్లారు.

ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, లేఅవుట్ ప్రకారం సదరు స్థలం పార్కు స్థలంగా నిర్ధారించారు. దీంతో మంగళవారం అక్కడ నిర్మించిన ప్రహరీలను తొలగించి, పార్కు స్థలంగా గుర్తిస్తూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో మంజీరా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాలను కాపాడటంపై హైడ్రా తీసుకున్న చర్యను స్థానికులు స్వాగతిస్తున్నారు.

